సీరియల్ -

విహారికోయిల

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

అతని వెన్నున మళ్ళీ యేదో పాకుతున్న అనుభూతి-ఒళ్ళు జలదరించింది.

ఆ గదిని దాటి వెళ్ళాడు.

అక్కడ పాలరాతితో కట్టిన స్నానాల గది కనిపించింది. మరోసారి కల మెదిలింది.

అవును, అదే గదిలో తనని పన్నీటి జలకాలాడించింది ప్రమద్వర.

వెనుతిరిగిన సిద్ధార్థ ఒంటిని మళ్ళీ చల్లటి తెమ్మెర తాకి అలనల్లన కదిలిపోయింది.

తిరిగివస్తూ ఆ గదిలోకి చూశాడు.

మరో మెరుపు మెరిసింది.

మెరుపు వెలుగులో మంచంమీద ఎవరో స్త్రీమూర్తి పవళించి వున్నట్టు లీలామాత్రంగా మెరిసింది.

సిద్ధార్థ మనసు ఇప్పుడు దృఢంగా వుంది. అక్కడి పరిస్థితికి అతను బాగా అలవాటు పడిపోయాడు ఏదానికీ చలించని స్థితికి చేరిపోయాడు.

ధైర్యంగా ఆ గదిలోకి అడుగుపెట్టాడు. బాగా చీకటిగా వుంది. లోపల ఏదో మత్తయిన వాసన. అవును, తక్కిన గదుల్లోలాగా ఆ గది మెరక వాసన కొట్టడంలేదు. యేదో సువాసన.

చీకట్లో మంచాన్ని తడుముకుంటూ వెళ్తున్నాడు. కాళ్ళకేదో అడ్డొచ్చి ముందుకు తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు. మంచంకోడు తలకి కొట్టుకుంది. నుదురు చిట్లింది. రక్తం జిగటగా చేతికి తగిలింది.

అలాగే మంచాన్ని సమీపించాడు.

బుస్‌మంటూ ఛీత్కారం వినిపించింది.

చటుక్కున వెనక్కి జరిగి వుండకపోతే తిరుగులేని కాలసర్పం కాటుకు బలైపోయుండేవాడు సిద్ధార్థ.

ఒక్క అంగలో ఆ గదినుంచి బయటకురికాడు. నడవాలో నడుస్తూ ఈసారి ఆ గదులకెదురుగా వున్న గదులవైపు కదిలాడు.

అతనికీ మహాలు విషయం చాలా గమ్మత్తుగాను, దుర్భేద్యమైన ఓ పజిల్‌లాగాను కనిపించింది. ఎలాగైనా దీన్ని ఛేదించితీరాలనే దృఢనిశ్చయం మనసులో వేళ్ళు పాతుకున్నది.

తన కల పదేపదే గుర్తుకొస్తోంది. కలలో తానీ మహల్లో సజీవమైన వ్యక్తులతో సంచరించాడు. ప్రమద్వర, ఆమె తండ్రి తప్ప తక్కిన వ్యక్తులందరు మూగజీవుల్లా మాటలురాని వాళ్ళలా కనిపించారు?

ఏది నిజం? తన కలా? ఇప్పటి ఈ పరిస్థితా?

ఆలోచిస్తూ మొదటి గదిలోకి నడిచాడు సిద్ధార్థ. మెరుపు వెలుగులో గోడకు చేరవేసి ఉన్న కత్తులు కటార్లు ఇంకా యేవో ఆయుధాలు ఒక్కక్షణం అతని

కట్టుబడ్డాయి.

ముందుకు కదిలాడు. పక్కనే యేదో శబ్దం! తల తిప్పాడు. సమ్మెటపోటులాంటి దెబ్బ బలంగా పడింది నెత్తిమీద.

వెంటనే స్పృహ తప్పిపోయింది సిద్ధార్థకు.

* * *

చటుక్కున మెలకువ వచ్చింది కోయిలకు.

అందుకు కారణం వెంటనే గ్రహింపుకు వచ్చిందామెకు.

హోరున వర్షం పడుతోంది.

అంతదాకా తను స్పృహ లేకుండా పడివున్నానని ఆమె గ్రహించింది. తనెక్కడున్నదీ వెంటనే ఆమెకు గ్రహింపు రాలేదు.

అయితే తనకి స్పృహ తప్పిపోయేముందు ఇసుక తుఫాన్ రావటం, తను గాల్లోకి లేచి వేగంగా ఎటో విసిరివెయ్యబడటం, గాల్లోనే తనకి స్పృహతప్పిపోవటం ఆమెకు ఒకదాని వెంట మరొకటి గుర్తువచ్చాయి.

ఆ వెంటనే ఆమెకు సిద్ధార్థ గుర్తువచ్చాడు. ఆమె గుండె ఝల్లుమన్నది. అవును, ఆసలే అర్భకుడు! ఇసక తుఫాన్ల గురించి ఏమాత్రం అనుభవంలేనివాడు.

పాపం, ఏమైపోయాడో....!? ముందు అతని గురించి వెతకాలి. తనలాగానే యెక్కడో ఈ ప్రాంతాల్లోనే దొరకవచ్చు.

చీకటి దట్టంగా పరచుకొని వుంది. కళ్ళముందున్నదేదీ కనిపించటంలేదు. చీకటికి తోడు ఎడతెరిపిలేని వర్షం! అంతకంతకు పెరిగిపోతూనే వుంది.

అయినా సరే, తను ముందుగా సిద్ధార్థ గురించి వెతికి

తీరుతుంది. తన ప్రతిన చెల్లించటంకోసం, తనవాళ్ళందరు వెనుకంజవేసిన క్షణాన, తనకి అండగా నిలిచి తనకోసం తన వెన్నంటి వచ్చిన ధీరోదాత్తుడు సిద్ధార! అలాంటి మంచి మనిషి ఉనికి తెల్సునని అతన్ని రక్షించవలసిన బాధ్యత తనమీద వున్నది.

ఆమె చేసిన ఓ తెలివైన పనేమిటంటే, తుఫాన్ ప్రారంభమైన వెంటనే కళ్ళు గట్టిగా మూసేసుకున్నది. అందుకే ఆమె కళ్ళలో ఇసకపడి బాధించలేదు. కళ్ళు తెరిచేముందు కనురెప్పలమీద చేరిన ఇసకను అంతక్రితమే మొదలైన వర్షం కడిగేయటంవల్ల మెలకువ వచ్చిన వెంటనే కళ్ళు అకస్మాత్తుగా తెరిచినా ఆమెకెలాంటి బాధ కలగలేదు.

ఆమె లేచి అడుగు ముందుకు వేసింది. కాళ్ళకు పచ్చిక ఒత్తుగా తగిలింది. అంటే తానో మైదానంలో వున్నట్టు అర్థంచేసుకొన్నది. మైదానమంతా పచ్చిక దట్టంగా పెరిగి చూద్దామన్నా మట్టిగాని, ఇసకగాని కలిపించటం లేదు.

అయితే అప్పటికే వర్షం బాగా పెరిగిపోయింది. పచ్చికంతా నీటితో తడిసిపోయింది. కాళ్ళు బురదలో కూరుకుపోతున్నట్టు గ్రహించింది కోయిల.

చీకటి, వర్షం, ఒంటరితనం ఏవీ ఆమెను బాధించటం లేదు. సిద్ధారకేదైనా ఆపద సంభవించి వుంటుందనే ఆలోచనే ఆమెను బాధిస్తున్నది.

అతను....అతను....తన కన్నె హృదయాన్ని దోచుకున్నాడు. అతన్ని చూసినంతనే తన మనసు ఉరకలెత్తి అనిర్వచనీయమైన అనుభూతితో తన అణువణువు పరవశించిపోతుంది. అయితే, అతను తనకందని చందమామని

తనకి తెలుసు!

నాగరికుడు, పెద్ద వంశంలో పుట్టినవాడు అయిన దొరబిడ్డలాంటి సిద్ధార ఎక్కడ? ఎడారిలో విద్యా గంధం లేకుండా నాగరికత అంటే తెలియని అజ్ఞానులైన తామెక్కడ?

అతన్ని తన వెంట అనవసరంగా తీసుకువచ్చానేమో నని పదేపదే తనని తాను నిందించుకున్నదామె. తన ప్రతిజ్ఞ చెల్లించుకున్నాక అతన్ని ఎడారి దాటించి పంపించివెయ్యాలనుకున్నది. కాని జరిగింది వేరు!

అనుకోకుండా ఇసుక తుఫాన్ చెలరేగి వుండకపోతే ఈపాటికి ఆ ఘోర్క్ జాతి బందిపోట్లను మట్టుబెట్టి, సిద్ధారను ఎడారి దాటించి వుండేది తను.

ఆమె మనసులో కృత నిశ్చయం!

అయితే అంతలోనే తానున్నది ఎడారి ప్రాంతం కాదని గుర్తువచ్చిందామెకు.

చుట్టూ ఎటు చూసినా పచ్చికబయలు. అంతుదొరక నట్టున్న పెద్ద మైదానం! ఈ ప్రాంతం తనెప్పుడూ చూడనిది. తను ఎడారికి ఎంత దూరంలో వున్నదో, ఎటువైపునున్నదో ఏమీ అంతుబట్టడంలేదు.

అసలే రాత్రిసమయం, కటిక చీకటి, ఆకాశం చిల్లులుపడినట్టు ఎడతెరిపిలేని వర్షం. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడ వెతకాలి?

ఆమెకి కంటనీరు తిరిగింది. ప్రకృతి విలయతాండవం చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ ఎక్కడైనా స్పృహ లేని స్థితిలో పడివుంటే, ఈ వాన తాకిడికి, ధాటికి అతనికి ప్రమాదం ముంచుకొస్తూంది. అప్పటికే చూస్తూండ గానే నదిలా తయారయింది మైదానం.

"సిద్ధార్థా" అంటూ, ఎలుగెత్తి అరుస్తూ నీటిలో కాళ్ళీడ్చుకుంటూ అలా నడుస్తూనే వుంది చాలా సేపటి వరకు.

అంతకంతకు వర్షం ఉధృతమయ్యింది. ఉరుములు, మెరుపులు..విపరీతమైన గాలి. ఆమె అడుగుతీసి ముందుకు వెయ్యలేని పరిస్థితిలో ఎదురుగా ఏదో కోట గోడలాంటిది కనిపించింది.

అది అంతక్రితం సిద్ధార్థ ప్రవేశించిన శిధిలమైన కోట వెనక భాగం. సిద్ధార్థని పేరుపెట్టి పిలుస్తూ, అటు సాగిపోయింది కోయిల. ముఖద్వారంగుండా కోట లోపలవైపుకు ప్రవేశించి వుంటే ఆమె సిద్ధార్థను కలుసు కుని వుండేది!

కాని ఆమె ఆ కోటను చుట్టివున్న గోడకు మరో పక్కనుండి వెనకవైపుకి వెళ్ళిపోయింది ఎలుగెత్తి సిద్ధార్థను పిలుస్తూ.

అయితే, అక్కడ తనకోసం ప్రమాదం పొంచివున్న విషయం ఆమెకి తెలియదు.

• • •

"హల్లో, ఈజిట్ ఏర్‌పోర్ట్?"

దివ్యగొంతు గుర్తుపట్టిన ఆ విమానాశ్రయాధికారి, "ఎస్...." అన్నాడు ఇబ్బందిగా.

"సర్....ఎనీ ఇన్ఫర్మేషన్ ఎబౌట్ సిద్ధార్థ?"

"లేదు మేడమ్. నిన్న వెళ్ళిన సిబ్బంది ఇంతక్రితమే ఇక్కడికి చేరుకున్నారు. వాళ్ళు ఆ స్పాట్‌ని లొకేట్ చెయ్యలేకపోయారు. మరో స్క్వాడ్‌ని పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం...."

అని అతనింకా ఏదో చెపుతుండగానే దివ్య అడ్డు

తగిలింది.

"ఇంత పెద్ద ఏర్ ఫోర్స్ వుండికూడా మిస్సయిన ఓ పైలట్ ని లొకేట్ చెయ్యలేకపోతున్నారంటే నమ్మ శక్యం కావటంలేదు" అన్నది.

"అమ్మా, మీరింకా చిన్నవారు. లోకంపోకడ సరిగా తెలీని వయసు. ఒక్కోసారి అతిచిన్న విషయం కూడా పరిష్కరించటానికి చాలాకాలం పట్టొచ్చు. కొద్ది గంటల్లో నే సాల్వ్ చెయ్యొచ్చు, చెప్పలేం."

"అయితే, నాదో చిన్న రిక్వెస్టు...."

"ఏమిటది?"

"ఈసారి మీ సిబ్బందితో నేనూ స్పాట్ కి వస్తాను."

"చూడండమ్మా. మీకిదివరకే చెప్పాను—అందుకు రూల్సు పర్మిట్ చెయ్యవని...."

"నేను పర్మిషన్ తెచ్చుకుంటే....!?"

"కష్టం—సివిలియన్స్ని అనుమతించరు."

"నేను అనుమతి సంపాదిస్తాను...."

"మేడమ్...."

"సర్, ప్లీజ్....నేను పర్మిషన్ తెచ్చుకుంటే స్క్వాడ్ తో బాటు నన్నూ వెళ్ళనిస్తారు కదూ....!?"

"అఫ్కోర్స్...."

"ఓ.కె, థాంక్యూ! స్క్వాడ్ ఎన్నిగంటలకు బయ ల్దేరుతుంది?"

"ఇప్పుడు ఉదయం ఎనిమిదన్నర కావస్తూన్నది. పది గంటలకి బయల్దేరవచ్చు. ఎందుకంటే, సిద్ధార్థ ప్లేన్ లో నించి జారిపోయినప్పుడున్న సీనియర్ పైలట్ సునీల్ వస్తున్నారీసారి. ఆయన మరో గంటలో ఏర్ పోర్టులో

రిపోర్టు చెయ్యవలసి వుంది."

"సారీ గ్లాడ్ టు హియర్. నేను మరో అరగంటలో ఏర్‌పోర్టుకొస్తూన్నాను. ఈ లోపల అధారిటీస్‌నించి పర్మిషన్ తెచ్చుకుంటాను...." ఫోన్ పెట్టేసి లేచి నిల్చున్నది దివ్య.

మరో గంట తర్వాత ఆమె ఏర్‌పోర్టులో వుంది, పర్మిషన్ లెటర్‌తోబాటు. ఆమె తండ్రికి సెక్రటేరియట్‌లో వున్న పలుకుబడి గురించి తెలియని అధికారులు ఆమె తెచ్చిన ప్రత్యేక అనుమతి పత్రం చూసి ఆశ్చర్యపోయారు. ఆమె పట్టుదల, స్థిరనిశ్చయం చూసి ముచ్చటపడ్డారు కూడా.

"సీనియర్ పైలట్ సునీల్ ఇంతక్రితమే రిపోర్టు చేశారు. మరో అరగంటలో ఆయన సారథ్యంలో స్పెషల్ స్క్వాడ్ ఆ స్పాట్‌కి బయల్దేరబోతోంది" చెప్పాడు ఓ సీనియర్ అధికారి.

అతనామాటలు చెప్తుండగానే సునీల్ అక్కడికొచ్చాడు. ఆ అధికారి దివ్యను అతనికి పరిచయంచేశాడు.

ఆమెను చూస్తూనే సునీల్ దిగ్భ్రమ చెందినట్టు ఆమె నుంచి దృష్టి మరల్చుకోకుండా నిల్చుండిపోయాడు.

అతనంత నిర్లజ్జగా, నిశితంగా తనని గుచ్చి గుచ్చి చూస్తూంటే సిగ్గుతో దివ్య ఒళ్ళు కుంచించుకుపోయింది. ఛీ, ఇతనికి సంస్కారం రవంతైనా లేదు—అని విసుక్కుంది మనసులోనే.

సునీల్ ఆమెను తాకేంత దగ్గరగా వచ్చి "నువ్వేనా సిద్ధార్థ గర్ల్ ఫ్రెండ్‌వి?" అన్నాడు ఆదోలా ధ్వనించే గొంతుతో.

అతని ఏకవచన ప్రయోగానికి ఒళ్ళు మండిపోయినా

తమాయించుకుంది దివ్య. మౌనంగా తెలిపింది.

"అతనికోసం వెతకటం శుద్ధ దండగ. ఐ థింగ్ హి ఈజ్ నో మోర్!" అన్నాడు చాలా తేలిగ్గా సునీల్.

"స్టాపిట్!" ఏర్ పోర్ట్ ఆఫీసు ప్రతిధ్వనించింది దివ్య అరుపులకి. అందరి దృష్టి ఆమెమీదికి తిరిగింది. ఆశ్చర్యంగా ఆమెనే గమనిస్తున్నారు.

"సారీ.........ఆవేశాన్నాపుకోలేకపోయాను. సిద్ధార్థ గురించి ఎలాంటి చెడువార్తనైనా భరించలేని స్థితిలో వున్నాను. ఐ హోప్ హి ఈజ్ సేఫ్!....మీరు నా ఆశలమీద కుండెడు నిప్పులు కుమ్మరించి అప్ సెట్ చేశారు" అన్నది నీరసంగా దివ్య.

సునీల్ ముఖం అప్రసన్నంగా వుంది. కాని దివ్య ముఖంలోకి చూస్తుంటే, అది గాలికెగిరిపోయింది. ఉత్సాహం వచ్చింది.

"ఓ.కే! నువ్వు మాతో రావటానికి మాకేం అభ్యంతరంలేదు. యూ ఆర్ మోస్టు వెల్ కం!" అన్నాడు సునీల్. ఆ మాట అతను మనస్ఫూర్తిగానే అన్నాడు. అందుకు కారణం దివ్య-దివ్యమంగళ స్వరూపం, మగాడ్ని పట్టి ఆపివెయ్యగల అసమాన సౌందర్యం.

ఆ మాటతో ఆమెకు ఎనలేని ఆనందం, ఉత్సాహం కలిగాయి. అప్పుడే తను సిద్ధార్థని కల్సుకున్నట్టు అతనితో కబుర్లు చెప్పుకుంటున్నట్టు ఓ అందమైన దృశ్యం ఆమె మనోఫలకంమీద రూపుదిద్దుకున్నది.

ప్రత్యేక విమానం బయల్దేరటానికి సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. సునీల్ సారథ్యంలో మరో ఇద్దరు పైలట్స్, ఇద్దరు స్టీవార్డులు, మరో యిద్దరు అధి

కారులు బయల్దేరుతున్నారు. దివ్యతో మొత్తం ఎనిమిది మంది.

దివ్య లాంజ్‌లో కూచుని ఉత్కంఠతో యెదురు చూస్తోంది. అనుకోకుండా స్టీవార్డులిద్దరు మాట్లాడుకుంటున్న సంభాషణ ఆమె చెవుల బడింది.

వాళ్ళ మాటలమధ్య సిద్ధార్థ పేరు, మరో అమ్మాయి పేరు దొర్లటంతో ఆసక్తిగా చెవి ఒగ్గి విన్నది.

"....సుస్మిత కూడా సిద్ధార్థతో ఉరికేసిందని సునీల్ సాబ్ చెప్పాడు. వాళ్ళిద్దరు ఏదో ప్లాన్ మీదనే పారాచూట్స్‌లో విమానంనించి ఉరికేశారట...." అన్నాడు స్టీవార్డు.

"వారిద్దరికీ ఎన్నాళ్ళుగానో సంబంధాలు సాగుతున్నాయట. సునీల్ సాబ్ సుస్మితని పెళ్ళిచేసుకోవాలనుకున్నారు. ఆమెతో చెపితే ఆయన్ని తిరస్కరించడమే కాక, తను సిద్ధార్థని పెళ్ళిచేసుకోబోతున్నట్టు తెగేసి చెప్పిందట—తన జోలికి వస్తే సిద్ధార్థతో చెప్పి దేహశుద్ధి చేయిస్తానని బెదిరించిందట...."

"ఇంత జరిగినా, సునీల్ సాబ్ వాళ్ళిద్దరి జాడ తెలుసుకోవటం కోసం స్వయంగా బయల్దేరారంటే ఆయనదెంత సంస్కార హృదయమో...."

"గట్టిగా మాట్లాడకు. అదిగో ఆ అమ్మాయి సిద్ధార్థ ప్రియురాలట. అసలు సిద్ధార్థ ఈమెనే పెళ్ళిచేసుకుంటాడని అనుకునేవారు...."

"పెళ్ళి ఒకరితో, రొమాన్స్ మరొకరితో....అప్పుడే మజా వస్తుంది."

"ఏం మజానో?....ఆడపిల్లల జీవితాలతో ఆటలాడుకునే సిద్ధార్థలాంటి దుర్మార్గులకి అదే సరైన శిక్ష.

వాళ్ళిద్దరు ఇంకా బతికే వుంటారనుకోవటం వెర్రితనం."

"అంతే....కాని, కనీసం వాళ్ళిద్దరి శవాలినైనా వెతికాల్సిన బాధ్యత డిపార్టుమెంట్ కుంది కదా. అందుకే ఈ ప్రయత్నమంతా...."

"అదిగో, ఆ అమ్మాయి ఇటే వస్తోంది, మన మాటలు వినెయ్యలేదు కదా ...!?"

"విన్నట్టే కనిపిస్తోంది....అయినా, నువ్వే మెల్లగా మాట్లాడమంటే విన్నావు కాదు...."

అంటుండగానే దివ్య అక్కడికి చేరుకుంది. ఆమె ముఖం అవమాన భారంతోను, ఉక్రోషంతోనూ, అసహాయతతోను ఎర్రబడింది.

సిద్ధార్థ గురించి తనెంతో ఉన్నతంగా ఊహించుకుంది. కాని అతనింత నమ్మకంచకుడా? అతని గురించా తానింత తాపత్రయ పడుతోంది?

ఇదివరకోసారి ఫోన్ చేసినప్పుడు ఏర్‌పోర్టు అధికారి తనకు వివరాలు చెపుతూ సుస్మిత అనే ఏర్‌హోస్టెస్ కూడా సిద్ధార్థతో బాటు విమానంనుంచి దుమికిందని చెప్పినప్పుడు తనా విషయానికి పెద్దగా ప్రాముఖ్యత నివ్వలేదు. ఆ మాట వినగానే మనసు చివుక్కుమన్నది. కాని అంతలోనే సర్దుకున్నది. కాని, వీళ్ళ మాటల్నిబట్టి విషయం చాలా దూరం వెళ్ళిందని తెలుస్తోంది.

"చూడండి.........మీరిప్పటివరకు చెప్పిందంతా నిజమేనా?" సూటిగా అడిగింది దివ్య.

వాళ్ళిద్దరు తడబడి, "మేమేమీ చెప్పలేదే!.....ఏ విషయం మీరడిగేది?" అన్నారు అమాయకంగా మొహం పెట్టి.

సరిగ్గా అప్పుడే సునీల్ అక్కడికొచ్చి,

"స్పేస్ సిద్ధంగా వుంది, సిద్ధంగా వున్నారా?" అనడిగాడు దివ్యను.

"నేను రావటంలేదు. కాన్సిల్డ్" అన్నది కూల్ గా దివ్య.

సునీల్ నిర్ఘాంతపోయి, "అదేమిటి? ఎంతో దుర్లభమైన పర్మిషన్ తెచ్చుకుని రానంటారేమిటి? వాట్స్ ద మేటర్?" అన్నాడు.

స్టివార్డ్లిద్దరు మెల్లిగా అక్కడ్నుంచి జారుకున్నారు.

దివ్యకి దుఃఖం తన్నుకొస్తోంది. కాని పరాయి మగాడి ముందు లోకువ కావటమిష్టంలేక దిగమింగుకున్నది.

"మేడమ్ ..మీరెందుకో అప్ సెట్ అయినట్టున్నారు. సిద్ధార్థ తప్పక క్షేమంగా వుంటాడు. ఈ రోజు అతన్నెలాగైనా ట్రేస్ చేస్తాను. బిలీవ్ మీ...."

అప్పటికీ దివ్య ముఖంలో అప్రసన్నత తొలగిపోలేదు.

"మీకింకా నమ్మకం కుదరలేదనుకుంటాను నామీద!" అతని మాటల్లో నిజాయితీ, కొద్దిగా బాధ తొంగి చూశాయి.

చటుక్కున తలెత్తి అతని వంక చూసి, "నమ్మకం కుదరనిది మీమీద కాదు" అన్నది.

"దెన్?! ఏమిటి మీ అభ్యంతరం?"

"సిద్ధార్థ గురించి...."

"ఓహో.... ఈ స్టివార్డులేమైనా అవాకులు, చవాకులు వాగివుండాలి, అవునా?"

దివ్య మౌనంగా చూస్తోందతని వంక.

"చూడండి దివ్యా, మీరు నాకన్న చిన్నవారు, నువ్వని పిలుస్తాను, అభ్యంతరం లేదుకదా...."

తల అడ్డంగా తిప్పింది.

"గుడ్........సిద్ధార్థ మీరనుకుంటున్నట్టు నిజంగా మంచివారే! మీరనుమానిస్తూన్నట్టు, ఇక్కడి వాళ్ళు చెప్పుకుంటున్నట్టు చెడ్డవాడు కాదు........" నచ్చచెప్ప బోయాడు సునీల్.

"నాకంతా తెలిసిపోయింది. ఇన్నాళ్ళు గుడ్డిగా నమ్మాను. అందుకే....ఇంతక్రితం వరకు అతనికోసం ఆరాటపడ్డాను. ఇప్పుడిక అతని గురించి తలచటమే పాపమనిపించి, తిరిగివెళ్ళిపోతున్నాను."

సునీల్ కి ఆమె మాటలు చాలా ఆనందాన్ని కలిగించాయి. అయితే తన భావాల్ని బయటికి ప్రకటితం కాకుండా జాగ్రత్తపడ్తున్నాడు.

"దివ్యా, మరొక్కసారి ఆలోచించు! ఆవేశంలో అలా మాట్లాడుతున్నావుగాని, ఒక్కసారి ఇంటికి వెళ్ళి ఆలోచిస్తే అతనిమీది కోపం ఇట్టే ఎగిరిపోతుంది.... కమాన్, వెళ్దాం!"

"నేను రాను, రాను, రాను....అంతేకాదు ఇక అతని గురించి ఎన్నటికీ, మరెన్నటికీ మిమ్మల్ని ఎంక్వాయిరీ చెయ్యను. అతని ఉనికి తెలిసినా నాకు ఇన్ఫార్మ్ చెయ్యవద్దు" చరచర ఏర్ పోర్టు బయటికి నడిచింది దివ్య.

• • •

కళ్ళు భారంగా తెరిచాడు సిద్ధార్థ.

తల పగిలిపోతున్నట్టు, కళ్ళముందు దృశ్యం అలికేసినట్టు కనిపించింది కాసేపు.

తల అప్రయత్నంగా తడుముకున్నాడు. జిగటగా తగిలింది గడ్డకడ్తున్న నెత్తురు. జరిగిందంతా అప్పుడు గుర్తు వచ్చింది.

తనా గదిలో ఏవో కత్తులు, కటార్లు గుట్టగా పోసి

వుండటాన్ని మెరుపు వెలుగులో గుర్తించి గదిలోకి అడుగు పెట్టాడు. ఆ వెంటనే ఎవరో తన నెత్తిమీద గట్టిగా కొట్టారు. క్షణం తనకి స్పృహ తప్పిపోయింది.

అయితే, తనని కొట్టిందెవరు? నిర్జనంగా వున్న ఈ పాడుబడ్డ భవనంలో మనుషులు మసులుతున్నారా? ఊహూ, మనుషులు కాదు—బహుశా యే భూతమో, దయ్యమో....!?

తనని తాకుతూ పోయిన చల్లని గాలి తెమ్మెరలు గుర్తువచ్చి వెన్నున జరజర యేదో పాకినట్టనిపించింది. తల విదిలించాడు.

చటుక్కున లేచి నిల్చుని గదంతా ఓసారి కలియజూశాడు సిద్ధార్థ. గదినిండా తుప్పుపట్టిన పురాతన కాలపు కత్తులు, బల్లాలు, ఇంకా అలాంటి ఆయుధాలు గుట్టలు పోసివున్నాయి. ఎక్కడినుంచో వెలుగురేఖలు లోపలికి ప్రసరిస్తూన్నాయి.

అంటే.... తెల్లవారబోతున్నదన్నమాట!

ముందుకడుగువేశాడు. కాలికి రాయిలాంటి గట్టి పదార్థం తగిలింది.

కిందికి వంగి చూశాడు. అది పైకప్పునుంచి జారిపడ్డ మట్టిపెళ్ళ!

తన తలపైన పడిన దేమిటో సిద్ధార్థకి తెలిసిపోయింది. రాయికన్న బలంగా వున్న ఆ పెళ్ళ పైనుంచి సరాసరి వచ్చి తన నెత్తిమీద పడింది. వెంటనే దాని ధాటికి తన బుర్ర పగిలి స్పృహ తప్పింది.

ఒక్కక్షణం—ఆ ఆయుధాల్లో దేనినైనా తీసుకుందామనుకున్నాడు. కాని పదునుపోయి తుప్పుపట్టివున్న ఆయుధం తనకు ఉపయోగపడదని గ్రహించి ఆ

ప్రయత్నం విరమించుకుని గది బయటకు నడిచాడు.

భవనం చుట్టూ ఓ పెద్ద సముద్రంలా వుంది వర్షపు నీరు. అసలు తానున్నది ఓ ద్వీపకల్పంలా, అదంతా సముద్రమేనన్న భ్రమ కలిగింది కాసేపు.

కానీ నీటిని దాటుకుని కోట బయటకు వెళ్ళట మెలా? చూడబోతే నీరు చాలా ఎత్తున ప్రవహిస్తోంది. ఈ నీరంతా తీసి నేల తనకి కనిపించాలంటే కనీసం ఇరవై నాలుగ్గంటలు పడుతుంది. అంతవరకు ఎదురు చూడటం అవివేకం. ఈదుకుంటూ పోవటం మేలు.

ఈ ఆలోచన రాగానే సిద్ధార్థ నీటిలోకి దూకి ఈదుకుంటూ కోట ముఖద్వారంవైపు సాగాడు.

కాళ్ళకు పాములు కాబోలు చుట్టుకుంటున్నాయి. ఏ బురదపాములో అయివుండాలి; కాళ్ళు విదుల్చుకుంటూ వాటిని వదిలించుకుంటూ పెద్ద బారలు వేసుకుంటూ ముఖద్వారం చేరుకున్నాడు సిద్ధార్థ.

కాని, ఏం లాభం? అక్కడకూడా నీరు నిలువెత్తున ప్రవహిస్తూనే వుంది. నీరు....నీరు....ఎటు చూసినా నీరు. ప్రళయం వచ్చినట్టు, ప్రపంచమంతా ఆ నీటిలో కొట్టుకు పోయినట్టు, నీరు తప్ప ఇంకేమీ కనిపించని భయంకర దృశ్యం!

సిద్ధార్థ కర్తవ్యం తోచక, కొద్దిసేపు కాళ్ళు చేతులు నీటిలో ఆడిస్తూ ఆలోచనలో పడిపోయాడు.

అంతక్రితం వరకు ఎటుచూసినా ఇసకతప్ప నీటి చుక్క దొరకని ఎడారిలో మాడిపోయిన తను, ఇప్పుడు నేల కనిపించని నీటిలో పడి నానుతున్నాడు, ఎంతలో ఎంత మార్పు?

ఇంతకీ కోయిల ఏమైనట్టు?

ఆమె తప్పక బ్రతికే వుంటుంది — ఇక్కడే..... ఎక్కడో!

నలువైపులా దీక్షగా చూస్తుంటూ పెద్ద బారలు వేస్తూ ఆ నీటిలో ఈదుకుంటూ పోతున్నాడు సిద్ధార్థ.

సరిగ్గా అప్పుడే సూర్యుడు ఉదయిస్తున్నాడు.

• • •

కోయిల యిక సిద్ధార్థను చూడగలననే ఆశ వదిలేసుకున్నది. అంతకంతకు వర్షం ఉధృతమై ఆమె కాలుతీసి ముందుకు వెయ్యలేని పరిస్థితి యెదురయ్యింది. మనసు మాత్రం అతనికోసం తపన పడుతోంది. శరీరం ప్రతిఘటిస్తోంది.

తలదాచుకునే నీడకోసం ఆమె చుట్టూ కలియ చూసింది. కనుచూపు మేరలో ఓ పశువుల శాలవంటిది కనిపించింది. వేగంగా అటు పరుగెత్తింది.

పాక దగ్గరపడింది. అది వెదురుతోను, తాటాకులతోను వేసిన శాల. ఒక్క అంగలో దాని లోపలికి చేరుకున్నది.

లోపల కనిపించిన దృశ్యం చూసి ధైర్యవంతురాలు అయిన కోయిల కూడా ఓ అడుగు వెనక్కు వేసింది.

ఆ పాక చాలా ఎత్తయిన ప్రదేశంలో వుండటంవల్ల అక్కడ వర్షపునీటి ప్రభావంలేదు. లోపలంతా పొడిగా వెచ్చగా వుంది.

వెచ్చగా వుండటానికి కారణం అక్కడ ఓ నెగడు మండుతోంది. నెగడు చుట్టూ ముగ్గురు వ్యక్తులు కూచుని వున్నారు. నెగడు మంటలో ఏదో జంతు మాంసాన్ని కాల్చుకుంటున్నారు.

వాళ్ళు ముగ్గురు చూడటానికి మనుషుల్లా లేరు. కొరివి

దయ్యాల్లా వున్నారు. రాక్షసుల్లా వున్నారు. నరమాంసాన్ని పీక్కుతినే రాబందుల్లా వున్నారు. మంట వెలుగు వాళ్ళ ముఖాలమీద భయంకరంగా ప్రతిఫలిస్తోంది. వాళ్ళ కళ్ళు రక్తాన్ని వర్షిస్తున్నట్టున్నాయి.

అయితే ఇవేవీ ఆమెను భయపెట్టలేదు.

వాళ్ళు కాల్చుకుతింటున్నది జంతువుని కాదని మనిషినని గుర్తించి అదిరిపడింది. వాళ్ళలో ఒకడు కాల్తున్న మాంసఖండాన్ని పైకి తీసి పచనమయిందో లేదో చూస్తున్న సమయంలో మాంసఖండం కాలును చూసి అది మనిషి కాలని గ్రహించింది కోయిల.

ఆమెకు తెలియకుండానే సన్నని కేక ఆమె నోటి నుంచి వెలువడింది. ఆమె మనసులో ముందుగా మెదిలిన మనిషి__సిద్ధార.

సిద్ధారని చంపివెయ్యలేదుగదా వీళ్ళు!?

ఆ ఆలోచననే భరించలేకపోయింది కోయిల.

అప్పటికే ఆమెను చూసేశారు వాళ్ళు. ఆమె వెనుతిరిగేటంతలో ముగ్గురు ఆమెను ఒడిసి పట్టుకున్నారు.

కోయిల వాళ్ళకి చిక్కదలుచుకోలేదు. మెరుపు వేగంతో మండుతున్న నెగడులోనించి కట్టెల్ని చెరో చేత ధరించి వాళ్ళ ముఖాలకేసి కొట్టింది. ఇద్దరు కళ్ళు పోయి నేల కూలిపోగా మూడోవాడు ఆమె చేతుల్ని విరిచి పట్టుకుని బలంగా సందిట బిగించాడు.

కోయిల ఆ వ్యక్తి ఊహించనంత వేగంగా విల్లులా ముందుకి వంగి, ఆ వ్యక్తిని అమాంతం తన తలమీదుగా వేగంగా విసిరేసింది.

ఆ ఊపుకు పాకబయటకు దూసుకుపోయి నదిలా ప్రవహిస్తున్న నీటిలో పడిపోయాడా వ్యక్తి. ఈలోపల

కిందపడ్డ ఇద్దర్ని కట్టెలతో ఇష్టమొచ్చినట్టు బాది, వాళ్ళ ఒంటినిండా వాతలు పెట్టింది కోయిల. ఆ తర్వాత వాళ్ళని కూడా నీళ్లలోకి విసిరేసింది.

తను ఈ వర్షం తగ్గేవరకు తలదాచుకోవటానికి ప్రస్తుతం ఈ పాక తప్ప మరో ఆశ్రయంలేదు. వాళ్ల ముగ్గుర్లో ఇద్దరు అప్పటికే గుడ్డివాళ్లయిపోయారు. మూడో వాడు ఈపాటికే ముక్కుల్లోకి నోటిలోకి నీరు పోయి ఉక్కిరిబిక్కిరై అపస్మారక స్థితిలో వుంటాడు.

కోయిల చకచక ఆ పాకలో సిద్ధార్థకి సంబంధించిన ఆనవాళ్లకోసం వెతికింది. కనీసం అతను ధరించిన దుస్తులైనా అక్కడ కనిపిస్తే ఆ శవం అతనిదేననుకోవటానికాధారముంటుంది.

అయితే అక్కడ సిద్ధార్థకి సంబంధించిన గుర్తులేవీ కనిపించకపోవటంతో తేలిగ్గా హాయిగా ఊపిరిపీల్చుకున్నది.

బయట భూమ్యాకాశాలను ఏకంచేస్తూ వర్షం ఏకధాటిగా కురుస్తూనే వుంది.

కోయిల ఆ పాకలో ఒంటరిగా తెల్లవారేవరకు గడిపింది. ఆ ముగ్గురు నరమాంస భక్షకులు మళ్ళీ ఆ పాకలోకి అడుగుపెట్టలేదు. వాళ్ళేమయ్యారో జాడ కూడా తెలియలేదు.

తెల్లవార్తూనే పాకలోనించి బయటికి వచ్చింది కోయిల. కనుచూపుమేరలో ఎటుచూసినా ఉరకలెత్తి పారుతున్న మహాజల ప్రవాహం.

ఆమె కళ్ళు అప్పుడు కూడా, ఆర్తిగా, ఆత్రుతగా సిద్ధార్థకోసం వెతకటం మానలేదు. అతనెక్కడున్నా క్షేమంగా వుండాలని, అతనికెలాంటి ఆపదా కలగ

కూడదని కనిపించని దేవుడికి మనసారా మొక్కుకున్నది.

దగ్గర్లోనే ఎత్తయిన కొండప్రదేశం కనిపించిందామెకు. ఆ కొండెక్కి చూస్తే కొన్ని మైళ్ళదూరం వరకు నలువైపులా ఏమున్నదీ కనిపిస్తుంది. ఆ ఆలోచన రాగానే కోయిల నీటిలోకి ఉరికింది.

కాళ్ళు చేతులు వేగంగా నీటిలో కదిలిస్తూ మహా వేగంగా ముందుకి కొండవైపు ఈదుకుంటూ పోయింది కోయిల.

* * *

కాసేపు ఈదాక నిస్త్రాణ, నీరసం ఆవరించుకున్నాయి సిద్ధార్థలో.

కొద్దిక్షణాలు ఈదటం ఆపి, నీటి లోతును చూడటానికి నీటిలో నుంచున్నాడు. ఇప్పుడు నేల అందుతోంది కాళ్ళకు. అయితే నీటిమట్టం గడ్డందాకా వచ్చింది నించుని వుండగా. నోటిలోకి నీరుపోయే అవకాశాలు యెక్కువ. నోరు తెరవకుండా బాలెన్సు చేసుకుంటూ నడిస్తే ఫరవా లేదు.

జాగ్రత్తగా నీటిలో నడుస్తున్నాడు. కింద పచ్చిక ఒత్తుగా తగుల్తోంది కాళ్ళకి. మధ్య మధ్య కాళ్ళకి తీగెలు లతలు వంటి వేవో తగుల్తున్నాయి. బహుశా అవి నీటిపాములయి వుండాలి! ఒక్కోసారి అతిమెత్తగా స్పృశిస్తున్నాయి.

వీటికితోడు నీటిమీద తేలివస్తున్న విషసర్పాలు! ఒకటీ, రెండూ కాదు—పదుల సంఖ్యలో కొట్టుకొని వస్తున్నాయి. కొన్ని చనిపోయున్నాయి, మరికొన్ని ప్రాణభయంతో గిలగిల్లాడుతున్నాయి. వాటిని చూస్తూంటే ఇప్పుడు సిద్ధార్థకి భయమనిపించటంలేదు.

అవి ప్రస్తుతం తమ ప్రాణాలు నిలబడితే చాలుననే తాపత్రయంతో వున్నాయి. అయితే ఆ ఆందోళనలో మరింత పిచ్చిగా తాటుతవే ప్రమాదముంది.

అందుకే సిద్ధార్థ వాటిబారినుంచి లాఘవంగా తప్పించుకుంటూ నడుస్తూన్నాడు. మరీ లోతుగా వున్నచోట నేల అందటంలేదు. అప్పుడు ఈదక తప్పటంలేదు. మరో అరగంటలో సూర్యుడు పైపైకి పొడుచుకొచ్చాక నీటి మట్టం త్వరగా తగ్గటం మొదలెట్టింది.

అయితే ఎటుచూసినా ఒకేలా వుంది. సూర్యుడ్ని బట్టి దిక్కులు నాలుగింటిని గుర్తించగలిగినా, ఏ దిక్కుగా వెళ్తే ఏ ప్రాంతానికి చేరుతుందో, జనావాసప్రాంతమెక్కడుందో తెలిసే అవకాశంలేదు.

ఎడారిలో కనిసం ఏదో క గమ్యమైనా వుండేది, యిప్పుడదీ లేదు.

మరోగంట గడిచాక ఎత్తయిన ప్రదేశం కనిపించింది. ప్రాణం లేచివచ్చింది సిద్ధార్థకు. అప్పటికే గుడ్డలు బాగా తడిసి ఒంటికి అతుక్కుపోయి, చాలా అసౌకర్యంగా వుంది.

గట్టెక్కగానే దుస్తులు విప్పేశాడు. గట్టిగా పిండేసి ఎండకి ఆరవేశాడు. సూర్యుడి తీక్షణతకు అతని ఒళ్లు క్షణాల్లో ఆరిపోయింది. వెచ్చగా హాయిగా అనిపించింది. సూర్యుడినుంచి తన శరీరానికి ప్రాణవాయువు అందినట్టనిపించింది. సూర్యుడ్ని పెద్దవాళ్ళు భగవంతుడిగా ఎందుకు కొలుస్తారో అప్పుడర్థమయింది.

పదినిమిషాల్లో గుడ్డలు ఆరిపోయాయి. అక్కడక్కడ నిగిపోయినా గుడ్డలు ధరించగానే తేలిగ్గా అనిపించింది.

అక్కడ నీరు ఒక్కసారిగా కిందనున్న లోయలో పెద్ద శబ్దం చేస్తూ పడుతోంది. చూడటానికి చిన్నసైజు జలపాతంలా వుందక్కడ. ఎక్కడెక్కడినుంచో నీరంతా అక్కడికి చేరి లోయలో వేగంగా పడిపోతోంది.

తను ఈదుకుంటూ గుడ్డిగా వచ్చివుంటే ఈ గట్టు చేరకముందే సరాసరి ఆ లోయలో పడిపోయుండేవాడు. నిజంగా పెద్ద గండం గట్టెక్కింది.

అతనూహించినట్టు నిజంగా గండం గట్టెక్కలేదు. ఆశర్యాత కొద్దిక్షణాల్లో మరో రూపంలో అతన్నెదురొక్కన్నది.

సిద్దార్థ గట్టు పొడవునా ఏదో రహదారి వున్నట్టు గుర్తించాడు. రహదారి వుందనగానే ఆ పరిసరాల్లో ప్రజలు నివసిస్తున్నారనే అర్థం! అతని ముఖంలో కాంతిరేఖ వెలిగింది.

హుషారుగా ఆ గట్టు వెంబడి ముందుకు నడిచాడు సిద్దార్థ.

అక్కడ నేల బాగా దిగువ మట్టంలో వుంది. అయితే అటు ఇటు బండరాళ్ళ మధ్యగా రహదారి కనిపించింది.

సిద్దార్థ ఆ రహదారి గుండా ముందుకి నడిచాడు. అది సరాసరి ఓ మైదానంలోకి దారి తీసింది. మైదానంలో వరసగా కనిపించిన రాతి గుహల్ని చూడగానే విస్తుపోయాడు సిద్దార్థ.

ఒకటి, రెండు కాదు—వందల సంఖ్యలో ఉన్నాయవి. దూరానికి గుడిసెల్లా కనిపించాయి. దగ్గరకొచ్చాకగాని అవి గుహాలుగా గుర్తించలేదతను.

(ఇంకా వుంది)